చిన్నారుల ఆసక్తిని ప్రోత్సహించాలి


నవీన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయిలోనే చిన్నారుల్లో ఉన్న ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ఆయా కళలపై శిక్షణ ఇప్పించాలని నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో అంజలి నాట్యాలయం 13వ వార్షికోత్సవం, హంసాంజలి చారిటబుల్ ట్రస్ట్ 2వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు హంసవేణి శిష్య బృందం నాట్యాంజలి పేరిట చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సుమారు వంద మందికి పైగా శిష్యబృందం భరత, కూచిపూడి శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద ప్రదర్శనలతో కనువిందు చేశారు. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు వి.నవీన్‌యాదవ్, మోడల్స్ స్కూల్స్ మాజీ డైరెక్టర్ సరోజినీ దేవి, కవి రామకృష్ణ చంద్రమౌళి, సంస్థ వ్యవస్థాపకురాలు హంసవేణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి హౌస్ అరెస్ట్


ఆశీష్‌కుమార్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్‌ను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రారంభం కావడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు అతన్ని హౌస్ అరెస్ట్ చేసి సాయంత్రం వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వలేదు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్‌దే ప్రభంజనమన్నారు.

కులగణనతో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న గౌరీ సతీష్ తదితరులు

అఫ్జల్‌గంజ్: కులగణనతో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కొనసాగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దేశ చరిత్రలో బీసీ కులగణ చేపట్టడం ద్వారా చట్టసభల్లో అన్ని కులాలకు న్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ..చట్టసభల్లో బీసీ కులాలతో పాటు అన్ని కులాల వారికి రిజర్వేషన్లు న్యాయంగా జరుగుతాయన్నారు. బీసీల సంక్షేమం కోసం, బీసీల ప్రగతి కోసం, బీసీల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం ఎంతో కృషి చేస్తుందన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని గౌరీశంకర్ వైన్స్‌షాపు ఎదుట ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తుండగా సమాచారం అందుకోవడంతో బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిలింనగర్ వినాయకనగర్‌కు చెందిన ఈ.బాలజీ, జి.సాయితేజ, ఏ.జుగల్‌రాజు ముగ్గురూ కలిసి గంజాయి సేవిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి 12 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కలెక్టర్ కారును ఢీకొట్టిన కారు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 నుంచి రోడ్డునెంబర్-13 వైపు కలెక్టర్ బంగ్లాకు వెళ్తున్న కలెక్టర్ అధికారిక వాహనాన్ని ఎదురుగా అదుపుతప్పి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13లోని కలెక్టర్ బంగ్లాలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉంటున్నారు. ఆయన డ్రైవర్ హేమంత్‌కుమార్ రోడ్డునెంబర్-12 నుంచి రోడ్డునెంబర్ -13 వరకు కలెక్టర్ కారులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మినీ కూపర్ కారు ఢీకొట్టింది. దీంతో కలెక్టర్ కారు ముందు భాగం దెబ్బతింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రకుంట చెరువు.. సుందరీకరణ కరువు

- నీరు లేక మైదానాన్ని తలపిస్తున్న వైనం
- దృష్టి సారించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు


నీరు లేక ప్లే గ్రౌండ్‌గా మారిన షేక్‌పేట్ ఎర్రకుంట లేక్

గోల్కొండ: రాజకీయ నాయకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీన వైఖరికి ఓ నిండు చెరువు బలి అవుతోంది. స్థానికులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన చెరువు నేడు నీరు లేక ప్లే గ్రౌండ్‌గా మారింది. దశాబ్దాల నుంచి ఇదిగో అదిగో అభివృద్ధి పనులు అంటూ మంత్రులు, అధికారులు చేస్తున్న ప్రకటనలు గాలిమూటలుగానే ఉండిపోతున్నాయి. షేక్‌పేట్ నడిబొడ్డున ఉన్న ఎర్రకుంట చెరువు అధికారుల వైఖరి ఇలాగే ఉంటే కనుమరుగు కావడం ఖాయమని స్థానికులు అంటున్నారు. బల్దియా వారు ఈ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి షేక్‌పేట్ ఎర్రకుంట లేక్ అంటూ బోర్డు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. సామాజిక సంస్థలు మాత్రం గతంలో చెరువు పరిరక్షణ, చెరువులో వ్యర్థాల తొలగింపు లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ప్లాస్టిక్ ఫ్రీ చెరువుగా మార్చేందుకు సైతం స్వచ్ఛంద సేవా సంస్థలు ఎన్నోమార్లు విద్యార్థులతో కలిసి ఈ చెరువు వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. అటూ అధికారులు, ఇటూ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్వచ్ఛంద సేవా సంస్థల వారు విసుగెత్తిపోయారు. వర్షా కాలంలో ఈ చెరువు మురికి కుంటగా వేసవి కాలంలో పిల్లల ప్లే గ్రౌండ్‌గా మారుతుంది. నాలుగు నెలలు ఇందులో నీటి చుక్క ఉండకపోవడంతో స్థానికంగా నివసించే విద్యార్థులు ఇక్కడ ఆటలు ఆడుకుంటున్నారు. మరో వైపు సందు దొరికితే చాలు అన్నట్లుగా కబ్జాదారులు సైతం చెరువును కాజేయడానికి సిద్ధంగా ఉన్నారు.

ఫలించని స్వచ్ఛంద సంస్థల ప్రయత్నాలు..

ఈ చెరువును సుందరీకరించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. చెరువులో వ్యర్థాలను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ ఫ్రీ జోన్ నినాదంతో చెరువు వద్ద అనేక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అయితే బల్దియా అధికారుల నుంచి మాత్రం వీరికి ఎటువంటి మద్దతు లభించలేదు. స్థానికులు సైతం షేక్‌పేట్ ఎర్రకుంట లేక్‌ను సుందరీకరించి లేక్ చుట్టూ వాకింగ్ కోసం ట్రాక్ నిర్మించాలని అధికారులను కోరుతున్నారు. అయినా ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఎటువంటి మద్దతు లభించలేదు. ఇప్పటికైనా అధికారులు చెరువును సుందరీకరించి ఆహ్లాదం పంచే విధంగా రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు ముందుకు రావాలి..



షేక్‌పేట్ ఎర్రకుంట లేక్ అభివృద్ధికి అధికారులు ముందుకు రావాలి. చెరువులో ఉన్న వ్యర్థాలను తొలగించి చెరువు చుట్టూ పటిష్టమైన కంచెను ఏర్పాటు చేయాలి. చెరువు చుట్టూ పాదచారుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ నిర్మించాలి.
– డి.సత్యనారాయణ, షేక్‌పేట్

బ్రాహ్మణ విద్యార్థులకు ఉపనయనం


ఉపనయనం కార్యక్రమంలో డాక్టర్ రాంకుమార్ తివారీ, రాకేష్ తివారీ

చార్మినార్: పేద బ్రహ్మణులను ఆదుకోవడానికి తమ సంఘం నిరంతర కృషి చేస్తుందని దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ అధ్యక్షుడు డాక్టర్ రాంకుమార్ తివారీ అన్నారు. ఉన్నత విధ్యాభ్యాసం కోసం పేద బ్రహ్మణ విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అంద జేస్తున్నామన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పాతబస్తీ అంబికానగర్‌లోని కన్య కుబ్జ్ భవనంలో 14 మందికి ఉపనయనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వస్తు సామగ్రి పూర్తిగా దక్షిణ భారతీయ కన్య కుబ్జ్ సభ ఉచితంగా అందజేసింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రాంకుమార్ తివారీ మాట్లాడుతూ.. ఇప్పటికే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది ఉపనయనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాకేష్ తివారీ, ప్రధాన కార్యదర్శి విజయ్‌పాల్ పాండే, కోశాధికారి గోపాల్ ప్రసాద్ శుక్లా, సంయుక్త కార్యదర్శి భవానీ ప్రసాద్ తివారీతో పాటు బాల ప్రసాద్ తివారీ, రాజేంద్ర ప్రసాద్ తివారీ, శోభా దూబే, జయశంకర్ ప్రసాద్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

పాకో మార్షల్ ఆర్ట్స్‌లో సత్తాచాటారు


మెడల్స్ సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు సయ్యద్ ఇఫ్తెకార్ హుస్సేన్

జియాగూడ: పాకో మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్‌కు చెందిన క్రీడాకారులు ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో 15 గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు డబ్ల్యూకేఎఫ్ అక్రిడెట్ కోచ్, ఏకేఎఫ్ జడ్జ్-ఏ.షిహాన్ సయ్యద్ ఇఫ్తెకార్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. ఇటీవల విశాఖపట్నం రాజీవ్ గాంధీ పోర్ట్ ఇండోర్ స్టేడియంలో శనివారం నుంచి మంగళవారం వరకు సెన్సీ చీఫ్ ఆర్గనైజర్ తాజుద్దీన్ బాబూ ఆధ్వర్యంలో ఇండియా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంకకు చెందిన 1200 మంది క్రీడాకారులు మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో, సినీ యాక్టర్ డాక్టర్ సుమన్ తల్వార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నగరానికి చెందిన షేక్ అబ్దుల్‌బార్ హయ్యాన్, సయ్యద్ అహ్మద్ సాదిక్ హుస్సేన్, సయ్యద్ అబ్బాస్ హుస్సేన్ అల్వి, సయ్యద్ బషీరుద్దీన్ ఖిజార్, మహ్మద్ యాహియా అలీ అల్వి, సయ్యద్ ఆఫరాజ్ మోహియుద్దీన్, మహ్మద్ ఖాసీం మోహిఉద్దీన్ సిద్దిఖి, సిల్వర్ మెడల్స్ సయ్యద్ సకీనా ఫాతిమా, రోహిత్ హులి, సయ్యద్ అన్సర్ మోహియుద్దీన్, మహ్మద్ సోహైల్, రోహల్ హులి తదితరులు గోల్డ్ మెడల్స్ సాధించారు.

దివ్యాంగులకు చేయూతనందించడం అభినందనీయం


దివ్యాంగులకు వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న మల్లారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: దివ్యాంగులకు చేయూతనందించడం అభినందనీయమని హెచ్‌ఏఎల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. విశాఖపట్టణానికి చెందిన శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో విర్‌చో ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు, ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎస్.మల్లారెడ్డి హాజరై 200 మందికి పైగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, చెవి మిషన్లు, వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, హ్యాండ్ క్రాచెస్, వాకర్స్, హ్యాండ్ స్టిక్స్ తదితర మిషనరీలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దివ్యాంగులకు తమవంతు సహకారాన్ని అందిస్తున్న శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, విర్‌చో ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విర్‌చో ఫౌండేషన్ చైర్మన్ టి.ప్రవీణ, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం


సీఎం రేవంత్ రెడ్డితో సీనియర్ నాయకుడు వెంకటేశ్

గౌలిపురా: సామాజిక న్యాయం కాంగ్రెస్‌నే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే రాష్ట్రంలో చేపట్టి స్థానిక ఎన్నికల్లో బీసీలకు రాజకీయ న్యాయం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లు 42 శాతం తగ్గకుండా అవసరమైతే ఎక్కువ ఇస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అనంతరం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో కులగణన జరిపించి దేశానికి ఆదర్శ సీఎంగా రేవంత్ రెడ్డి నిలిచారన్నారు. ఇందిరమ్మ పాలనను గుర్తు చేస్తూ ప్రజాపాలన కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఎస్వీనగర్‌లో మాదిగల కళా ప్రదర్శన


మాట్లాడుతున్న ఎస్వీ నగర్ బస్తీ గౌరవాధ్యక్షుడు జంగయ్య మాదిగ

చార్మినార్: వర్గీకరణ అమలుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 7న జరుగనున్న లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి మాదిగ బిడ్డ హాజరుకావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కళా మండలి అధ్యక్షుడు ఎస్.వై.అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం పురానాపూల్‌లోని స్వామి వివేకానందనగర్ (ఎస్వీనగర్) బస్తీలో కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సీఎంలు వెంటనే వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. చార్మినార్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్నపాక యాదగిరి మాదిగ, చార్మినార్ ఇంచార్జి నరసింహ్మా స్వామి మాదిగల ఆధ్వర్యంలో జరిగిన ఈ కళా ప్రదర్శనలో బస్తీ అధ్యక్షులు మొక్కపల్లి సదానంద్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పెంజర్ల శ్యాంకుమార్ మాదిగ, గౌరవాధ్యక్షులు పందుల జంగయ్య మాదిగ, మహిళా అధ్యక్షురాలు బేబీ రాణి మాదిగ, గురుచరన్ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్ నివారణకు చర్యలు



గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బొల్లార్డ్స్

లంగర్‌హౌస్: రాంగ్ రూట్‌లో వాహనాల రాకపోకల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాల నివారించేందుకు మంగళవారం గుడిమల్కాపూర్ చౌరస్తా, రేతిబౌలి, పిల్లర్ నెంబర్ 68ల వద్ద బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో ప్రతిరోజూ కనీసం 800 వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళుతుంటే కేసులు నమోదు చేశారన్నారు. అయినా వారిలో ఎలాంటి మార్పులు రాకపోవడం బాధాకరమన్నారు. రాంగ్‌రూట్ వాహనాల రాకపోకలు, వాటి వల్ల జరిగే ప్రమాదాల నివారణకు పలు ప్రాంతాల్లో బొల్లార్డ్స్, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల కచ్చితంగా రాంగ్‌రూట్‌లు వాహనాలు పూర్తిగా నివారిస్తామన్నారు.

తెలంగాణలో మజ్లిస్ పార్టీకి ఆదరణ


ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో మజ్లిస్ పార్టీకి ప్రజల ఆదరణ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం మజ్లిస్ పార్టీ రంగారెడ్డి జిల్లాకు చెందిన మజ్లిస్ నాయకులు టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ ఎప్పుడూ యువతకు పెద్దపీట వేసిందన్నారు. దళితులు, బీసీల పక్షాన పోరాడే పార్టీ మజ్లిస్ ఒక్కటే అని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో తమ పార్టీ వరుసగా మూడు సార్లు విజయం సాధించడంలో యువత పాత్ర ఎంతో ఉందన్నారు. అదే విధంగా దళితులు ఏకపక్షంగా మజ్లిస్ పార్టీని ఆదరించడం వల్ల కూడా మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేసిన ప్రతి స్థానంలో విజయం సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ కార్పొరేటర్ నసీరుద్దీన్, మహ్మద్ ఫాజిల్ ఇర్ఫాన్, యాకుబ్ అలీ, నవీద్ అహ్మద్, జహంగీర్ కురేషి, షాహెద్ అలీ, ఉమర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ గోల్కొండ, నాంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఎస్‌ఏ కాలనీ, ఫ్రెడ్ అండ్ సాండ్స్ కాలనీ, నదీం కాలనీ, ఝూన్సీనగర్, సమతా కాలనీ, జమాలికుంట, అరుణకాలనీ, కులీకుతుబ్ షా నగర్, గ్రామర్ కాలనీ, సనా హోటల్, బజార్‌ఘట్, హనుమాన్ ఆలయం, హిమాలయ హోటల్, నిలోఫర్ హోటల్, రెడ్‌హిల్స్ వాటర్ వర్క్స్ పరిసర ప్రాంతాలు, నాంపల్లి మార్కెట్, యూసుఫియన్ దర్గా, ఎపీ లాడ్జ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

గోల్కొండ కోట సందర్శన వేళలు మార్చాలి

గోల్కొండ: గోల్కొండ కోట సందర్శన వేళలు మార్చాలని పర్యాటకులు కోరుతున్నారు. కోటను చూడడానికి రోజుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు గోల్కొండ కోట సందర్శనలు ఇబ్బందికరంగా మారాయి. కోట ఉదయం 9 గంటలకు తెరుచుకోగా సాయంత్రం 5 గంటలకు గేట్లను మూసి వేస్తారు. అయితే దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు నగరంలో గోల్కొండ కోటతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలను సైతం సందర్శిస్తారు. ఇతర పర్యాటక ప్రాంతాలకు భిన్నంగా గోల్కొండ కోట సందర్శనకు కనీసం రెండు గంటల సమయం పడుతుంది. ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకొని వచ్చే పర్యాటకులు ముందుగా గోల్కొండ కోటకే వస్తారు. కోట సందర్శన అనంతరం నగరంలోని ఇతర పర్యాటక కేంద్రాలను సందర్శించి వెళ్లే వారు ఉంటారు. అయితే గోల్కొండ కోట గేట్లు 9 గంటలకు తెరుచుకోవడం వల్ల విలువైన తమ సమయం వృథా అవుతుందని దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అంటున్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టండి



మణికొండ: మద్యం మత్తులో ఆకతాయిలు చేస్తున్న ఆగడాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న దొంగల ఆగడాలను అరికట్టాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆదివారం అర్ధరాత్రి మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ కాలనీలో మద్యం, గంజాయి సేవించి ఆకతాయిలో ఇంటికి వస్తున్న ఓ విద్యార్థిని కొట్టారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కాలనీవాసులపైకి ఎదురుతిరిగారని వివరించారు. అలకాపూర్ టౌన్ షిప్‌లో ఓ మహిళ వాకింగ్ చేస్తుండగా వెనకనుంచి వచ్చిన ఓ దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని వెళ్లాడన్నారు. రెండు ఘటనలు ఒకే రోజు జరగటంతో ప్రజలు భయాందోళన చెందారని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్‌ముదిరాజ్, మైనారిటీ అధ్యక్షుడు హాజీ, నాయకులు పురుషోత్తం, రమేష్, శ్రవణ్, అఖిల్, శరత్, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా టోలిచౌకీ చౌరస్తా


టోలిచౌకీ చౌరస్తా సమీపంలో తవ్విన గుంత

గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తా ప్రధాన రహదారితో పాటు చౌరస్తా పరిసరాల్లోని ప్రదేశాలు అధ్వానంగా తయారయ్యాయి. రెండేళ్లుగా టోలిచౌకీ చౌరస్తా, హకీంపేట్ రోడ్డు, టూంబ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్, డ్రైనేజీ తదితర పనులు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఈ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియకుండా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. టోలిచౌకీ చౌరస్తాను ముంపు బారి నుంచి తప్పించేందుకు ఇక్కడ జరుగుతున్న బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి. మరోవైపు టోలిచౌకీ నుంచి సెవన్ టూంబ్స్ వెళ్లే రోడ్డు కూడా భారీ గుంతలతో అధ్వానంగా తయారైంది. పైపులు వేయడానికి భారీ గుంతలు తవ్వి వాటికి ఎలాంటి రక్షణ లేకుండా ఉండడంతో ప్రమాణాలు చోటు చేసుకుంటున్నాయి.

నోటు బుక్స్ పంపిణీ

చార్మినార్: వసంత పంచమిని పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో బెంగాళీల సరస్వతీ పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పాల్గొని ఆలయ కమిటీ తరఫున బెంగాలీ చిన్నారులకు నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగాలీ కమిటీ ఆధ్వర్యంలో తమ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సరస్వతి పూజుల అనంతరం ఈ నెల 5న సరస్వతి విగ్రహంతో పెద్ద ఎత్తున నిమజ్జనోత్సవ ఊరేగింపు నిర్వహించనున్నారన్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి వచ్చి స్థిరపడిన బెంగాలీలు కలిసి కట్టుగా ప్రతి ఏడాది ఇలా సరస్వతి దేవి పూజలు నిర్వహించడం వారి ఐకమత్యానికి నిదర్శనమన్నారు.


నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న గాజుల అంజయ్య

'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు' ప్రదర్శనకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 7న ఓయూలో జరుగనున్న లక్షల డప్పులు-వెయ్యి గొంతుల ప్రదర్శనకు సిద్ధం కావాలని అని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం ఇటీవల ఆయనకు పద్మశ్రీ ప్రకటించిన సందర్భంగా మంగళవారం నిజాం కళాశాలలో నాన్ టీచింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ..అత్యంత న్యాయమైన, సమాజ పూర్తి మద్దతు కలిగిన ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తుది దశకు చేరుకుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల తర్వాత రాష్ట్రంలో ఎస్సీవర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి నేటి వరకు ఆ దిశగా పని మొదలు పెట్టకపోవడం విచారకరమన్నారు. ఎమ్మార్పీఎస్ చేస్తున్న కార్యక్రమాలకు పోలీసులు అడ్డుకోవడం సరికాదని సూచించారు. అనంతరం ఇటీవల ఓయూలో అత్యున్నత పదవులు పొందిన మాదిగ ప్రొఫెసర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం, నాన్ టీచింగ్, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డాక్టర్ మనోహర్, డాక్టర్ వెల్పుల కుమార్, జానపద కళాకారులు ఏపూరి సోమన్న పాల్గొన్నారు.

ప్రజలంతా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి


డాక్టర్ మోహన్‌రావును సత్కరిస్తున్న మహిళా యూనివర్సిటీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విశ్వవిద్యాలయంలో లెక్చర్ హాల్ 'ప్రజాస్వామ్య విజయానికి సుపరిపాలన' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం ప్రభుత్వ పాలన విభాగం హెచ్ఓడీ డాక్టర్ రజిని స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య వక్తగా రైల్వే డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.మోహన్‌రావు హాజరై కీలక ఉపన్యాసం చేస్తూ సుపరిపాలనకు సంబంధించిన అంశాలను మన పురాణాలైన రామాయణం, మహభారతంలో కౌటిల్యుడిని అర్థశాస్త్రంలో వివరించారన్నారు. పాలన పారదర్శకంగా జరిగినప్పుడే సుపరిపాలన సాధ్యమన్నారు. సుపరిపాలనకు సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌ను, కమిషనర్లను నియమించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కును నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నేర చరిత్ర కలిగిన రాజకీయ నాయకులతో సుపరిపాలన సాధ్యం కాదన్నారు. భారతదేశ ఎన్నికల వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు ఎంతైనా అవసరం ఉందన్నారు. ప్రజలు కులమతాలకు అతీతంగా ఓట్లు వేసినప్పుడే భారతదేశం అగ్రగామిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను బదిలీ చేస్తే అధికార వికేంద్రీకరణకు తోడ్పాటు అవుతుందన్నారు. నైతిక విలువలతో కూడిన పాలనాధికారులు, రాజకీయ నాయకులు దేశానికి ఎంతో అవసరమన్నారు. దేశంలో పెరుగుతున్న అవినీతిని అరికట్టడానికి ప్రజలంతా చైతన్యవంతమైన ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ మాధవితో పాటు పెద్ద ఎత్తున అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.